క్లుప్తంగా

బందరు రోడ్డులో ఆక్రమణల తొలగింపు



పెనమలూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి (బందరు రోడ్డు) మార్జిన్లో ఆక్రమణలను పోలీసులు మంగళవారం తొలగించారు. తాడిగడప జంక్షన్ నుంచి పోరంకి సెంటర్ వరకు చిరు వ్యాపారులు బందరు రోడ్డు మార్జిన్‌లను పూర్తిగా ఆక్రమించారు. దీంతో ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ పోలీసు సిబ్బందితో కలిసి బందరు రోడ్డు ఆక్రమించిన వ్యాపారులకు కౌన్సిలింగ్ నిర్వహించి ఆక్రమణలు తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే సమయంలో ప్రధాన రహదారిని ఆక్రమించరాదన్నారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నందున ఆక్రమణలు తొలగించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఉషారాణి, రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తోటకూర గోపీచంద్‌కు అభినందన



పెనమలూరు: పోరంకి గ్రామానికి చెందిన తోటకూర గోపీచంద్ అంతరిక్ష ప్రయాణం చేసి వచ్చిన సందర్భంగా రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు. పోరంకిలో మంగళవారం అమెరికా నుంచి వచ్చిన యువ ఎరోనాటికల్ ఇంజినీర్ గోపీచంద్‌ను మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కలిశారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ తెలుగు బిడ్డ అంతరిక్ష ప్రయాణం చేయడం చాలా గర్వంగా ఉందని అన్నారు. కాగా గోపీచంద్ గత మే 19వ తేదీన అమెరికాలో నాబ్లూ ఆరిజన్ కంపెనీ నిర్వహించిన ఎన్ఎస్–25 మిషన్‌లో అంతరిక్ష ప్రయాణం చేసి వచ్చారు. అమెరికాలో స్థిరపడిన గోపీచంద్ తన డ్రీం ప్రాజెక్టు ప్రిజర్వ్ లైఫ్ కార్పొరేషన్‌కు సీఈవోగా పని చేస్తున్నారు. మాజీ సర్పంచి తోటకూర కాశీవిశ్వేరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఉయ్యూరు: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఉయ్యూరు రూరల్ ఏఎస్ఐ ఆర్.లక్ష్మణరాజు అన్నారు. ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మంగళవారం మత్తుపదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గోలి వసంత కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో లక్ష్మణరాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను, ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. నవజీవన్ బాల భవన్ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ ఎస్‌కె. నజ్మా, ఎస్.జాకబ్ రాజు, హెచ్‌ఎం ఎన్. సలోమి, ప్రతినిధులు జె.జ్యోతి చంద్రిక, మహిళా సంరక్షణ కార్యదర్శి సుధామణి, రవికుమార్ పాల్గొన్నారు.

కేబుల్ వైరు చోరీ ఘటనలో ముగ్గురు అరెస్టు

కంకిపాడు: కేబుల్ వైరు చోరీ ఘటనలో ముగ్గురు నిందితులను కంకిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు..ఈనెల 25వ తేదీన కంకిపాడు పట్టణం నుంచి గొడవర్రు గ్రామం వెళ్లే కంకిపాడు లాకు రోడ్డు మార్గంలో లాకులు వంతెన వద్ద బీఎస్ఎన్ఎల్ కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. కేసు విచారణలో సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించారు. పునాదిపాడు ఫ్లైఓవర్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు ఏలూరు ప్రాంతానికి చెందిన గుంజి యాకోబు రాజు, తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, గాలి అంజి చోరీకి పాల్పడినట్లు తేల్చారు. వారి వద్ద నుంచి రూ. 1 లక్ష విలువైన కేబుల్ వైరు రికవరీ చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సందీప్ తెలిపారు.

జీతాలు ఇప్పించండి

పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లుగా పని చేస్తున్న తమకు జీతాలు ఇవ్వలేదని, ఇప్పటికైనా జీతాలు ఇప్పించాలని పలువురు స్వీపర్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఎలిమెంటరీ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లు, ఆయమ్మలకు గత కొద్ది నెలలుగా జీతాలు చెల్లించలేదని తెలిపారు. వెంటనే జీతాలు విడుదల చేసి తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, బాధిత స్వీపర్లు పాల్గొన్నారు.

దాడులను అరికట్టేలా చర్యలు చేపట్టాలి



మహిళలపై పని ప్రదేశాల్లో లెక్కకు మించి దాడులు జరుగుతున్నాయి. చాలా ఘటనలు వెలుగు చూడటం లేదు. ప్రభుత్వాలు మహిళా రక్షణ అంశాన్ని విస్మరిస్తున్నాయి. మహిళా రక్షణ చర్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయి. పని ప్రదేశాల్లో దాడులపై త్వరితగతిన చర్యలు లేకపోవడంతో బాధితులకు న్యాయం జరగడం లేదు. దాడులను అరికట్టేలా చర్యలు చేపట్టాలి. నిందితులకు రోజుల తరబడి తాత్సారం కాకుండా శిక్షలు వెంటనే అమలు చేయాలి.

–జి.కుమారి, ఆశ వర్కర్స్ యూనియన్ కృష్ణాజిల్లా అధ్యక్షురాలు, ఐద్వా మండల అధ్యక్షురాలు, కంకిపాడు



మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలి

కోల్‌కతా దుర్ఘటన దేశవ్యాప్తంగా కలచి వేసింది. ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించే వైద్యులకే రక్షణ లేకుండా పోవడం బాధాకరం. మహిళల భద్రత విషయంలో పాలకులు చెబుతున్న మాటలు నీటిమూటలుగా మారాయి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి. ముఖ్యంగా మహిళలు పనిచేసే చోట వారి భద్రత కోసం ప్రత్యేక రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.

– సీహెచ్ వెంకటలక్ష్మి, ఐద్వా నాయకురాలు, గన్నవరం



వివాదాల్లో సరస్వతీ నిలయం

- ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనతో సమస్యలు వెలుగులోకి
- తాగునీరు లేక అవస్థలు
- నిర్లక్ష్యంగా విద్యాశాఖ



ఈడుపుగల్లు మోడల్ స్కూల్

కంకిపాడు: విద్యాబుద్ధులు నేర్పే సరస్వతీ నిలయం వివాదాల సుడిలో చిక్కుకుంది. ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనతో స్థానికంగా ఉన్న సమస్యలు వెలుగుచూశాయి. విద్యార్థులు పడుతున్న ఇక్కట్లను తల్లిదండ్రులు ఏకరువు పెడుతున్నారు. సమస్యల పరిష్కారంలో విద్యాశాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం. ఈడుపుగల్లు మోడల్ స్కూల్ సమస్యలకు కేరాఫ్‌గా నిలిచింది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని చెరువు కట్ట సమీపంలో విద్యార్థుల సౌకర్యార్థం ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ విద్యార్థులు చదువుకునేలా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటుచేశారు. గ్రామానికి చెందిన పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన చిన్నారులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు.

విద్యార్థులకు రక్షణ కరువు

స్థానిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మండవ వెంకట శ్రీనివాస్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనతో అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. కొద్ది రోజులుగా ఈ తంతు జరుగుతున్నా ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారన్న వాదన తల్లిదండ్రులను ఆగ్రహావేశాలకు గురిచేస్తోంది. దీంతో ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ తొలగించి కొత్తవారిని నియమించాలన్నది స్థానికుల డిమాండ్. ఉపాధ్యాయుల ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షించేలా సీసీ కెమెరాలను విద్యాశాఖ ఏర్పాటు చేయాలన్నది మరో డిమాండ్.

విద్యాశాఖ పర్యవేక్షణ ఏదీ?

ఇంత జరుగుతున్నా విద్యాశాఖ మండల అధికారుల దృష్టికి సమస్యలు రాకపోవడం విడ్డూరంగా ఉంది. అధికారుల పర్యవేక్షణ ఏ మేరకు ఉందో అవగతమవుతుంది. కనీసం తాగునీటి సమస్యను సైతం ఎందుకు గుర్తించలేదో అధికారులకే తెలియాలి. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యార్థుల సమస్యలను ఏ మేరకు పరిష్కరిస్తారో వేచిచూడాలి.

వెలుగులోకి మరిన్ని సమస్యలు

ఈ సమస్యతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు వెలుగుచూశాయి. విద్యార్థులు వినియోగించే మరుగుదొడ్లను తరచూ విద్యార్థులే శుభ్రం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ద్వారా నియమితురాలైన ఆయా తన విధులను పక్కన పెట్టి తరగతి గదుల్లో గడుపుతుండటంతోనే ఈ సమస్య నెలకొందని తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థులతో పనులు చేయించడం ఎంతవరకూ సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకునేందుకు నీరు ఉంది కానీ, తాగేందుకు సమృద్ధిగా నీరు లేదు. ఆర్‌ఓ ప్లాంటు పూర్తి స్థాయిలో అందుబాటులో లేదు. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి మంచినీటి బాటిళ్లను తమతో పాటు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

పిల్లలతో పనులు చేయిస్తున్నారు

బడిలో పిల్లలతో పనులు చేయిస్తున్నారు. ఒకసారి చూసి అడిగితే నీకెందుకు అన్నట్టు మాట్లాడారు. పిల్లల సమస్యపై ప్రశ్నించే హక్కు లేదా. అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. టీచర్లతో సహా అందరినీ మార్చాలి. కొత్త వాళ్లను పెట్టాలి.



– సీహెచ్ కోటేశ్వరమ్మ, గ్రామస్తురాలు

అన్నీ సమస్యలే

ఇక్కడ తాగడానికి నీళ్లు లేవు. ఇళ్ల దగ్గర నుంచి తెచ్చుకుంటున్నారు. టీచర్ల వ్యవహారం ఏమీ బాగోలేదు. వాళ్లు ఉంటే పిల్లలను బడికి పంపలేం. కొత్త వాళ్లు రావాలి. సీసీ కెమెరాలు పెట్టాలి. అప్పుడే పరిస్థితి మారుతుంది. పిల్లలను వంకరగా చూసే టీచర్లు ఉంటే వాళ్ల పరిస్థితి ఏంటో చెప్పండి?.



– నక్కా గంగమ్మ, గ్రామస్తురాలు

చిత్రలేఖన పోటీల్లో పోరంకి విద్యార్థుల ప్రతిభ


చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

పెనమలూరు: చిత్రలేఖన పోటీల్లో పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి బహుమతులు గెలిచారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం మలినేని సుమలత మంగళవారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కృష్ణా జిల్లా శాఖ సంస్కార భారతి వారు కానూరు శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయంలో బాలగోకులం కార్యక్రమం నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9, 10వ తరగతి విద్యార్థులు వి.భార్గవి, జి.లక్ష్మి, ఎ.అఖిల, ఎ.మణికంఠ, ఎన్.ఉమామహేశ్వరరావు, కె.నాగతేజ చిత్రలేఖన పోటీల్లో పాల్గొని బహుమతులు గెలిచారని చెప్పారు. కానూరు మాజీ సర్పంచి అన్నే సుజాత విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికేట్లు అందజేశారు. చిత్రలేఖన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆరేపల్లి అప్పారావు మాట్లాడుతూ పోరంకి విద్యార్థులను దత్తత తీసుకొని వారికి చిత్రలేఖనంపై ప్రత్యేక శిక్షణ ఇస్తానన్నారు.

మానవత ఆర్థికసాయం


విద్యార్థినికి ఆర్థికసాయం అందిస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో తోచిన సాయం అందిస్తున్నామని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కేంద్ర కమిటీ కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బాపులపాడు మండలం నారాయణపురంకు చెందిన పాలకట్ల శ్వేత బీఎస్సీ నర్సింగ్ మూడవ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి కృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మంచంపైనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో కాలేజీ ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థినికి మానవత సభ్యులు తక్షణమే స్పందించి రూ. 27 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని స్థానిక మానవత కార్యాలయంలో విద్యార్థిని, ఆమె తల్లికి అందించారు. అభయాంజనేయస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నెరుసు భూషణం, మానవత సభ్యులు కూరెళ్ల సుబ్బాచారి, మరీదు వెంకటస్వామి, పాబోలు గణేష్, జన్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

వికాస్ కాలేజీలో క్లౌడ్ ఫౌండేషన్ కోర్సు ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బి.రమణ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మంగళవారం బీటెక్ విద్యార్థులకు ఐటీసీ అకాడమీ ఆధ్వర్యంలో క్లౌడ్ ఫౌండేషన్ కోర్స్ ప్రారంభించారు. విద్యార్థుల సాధికారతలో భాగంగా ఇన్ఫోసిస్ సంస్థ పీఎస్‌ఆర్ నేతృత్వంలో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ ఫౌండేషన్ శిక్షణ తరగతులు ప్రారంభించడం జరిగిందని కళాశాల చైర్మన్ ఎన్.నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐటీసీ అకాడమీ ఏపీ స్టేట్ హెడ్ ఎస్.దినకర్ రెడ్డి మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో ప్రపంచంలో క్లౌడ్ టెక్నాలజీ అతి ప్రాముఖ్యమైందన్నారు. ఈ కోర్సును విద్యార్థులందరూ తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ బి.రమణ మాట్లాడుతూ ఈ కోర్సు బీటెక్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం: గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ గీతాభాయితో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విషజ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని చెప్పారు. పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో బ్లీచింగ్, ఫాగింగ్ చేయించాలని సూచించారు. దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టాలని తెలిపారు. డాక్టర్ గీతాభాయ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన ఫీవర్ సర్వేలో 267 మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వీరిలో 41 మందికి టైఫాయిడ్, మిగిలిన వారు విషజ్వరాల బారినపడినట్లు తెలిపారు. వీరికి గ్రామాల్లోనే వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

గన్నవరంలో ఓపెన్ జిమ్ ప్రారంభం


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఎంపీ నిధులు రూ. 7 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మంగళవారం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. అనంతరం జిమ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలను ఎంపీ, ఎమ్మెల్యేలు పరిశీలించడంతో పాటు కొద్దిసేపు వ్యాయామం చేస్తూ ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీడీఓ ఇ.సత్యకుమార్, సర్పంచి నిడమర్తి సౌజన్య, ఉపసర్పంచి పాలడుగు నాని, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌ను దూరం పెట్టడం బాధాకరం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్, వాకర్స్

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంలో వాకర్స్ అసోసియేషన్‌ను అధికారులు విస్మరించడం బాధాకరమని వాకర్స్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వాకర్స్ సభ్యులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. క్రీడా ప్రాంగణంలో ఎంపీ నిధులతో వ్యాయామ పరికరాలను మాత్రమే కాంట్రాక్టర్ అమర్చి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఓపెన్ జిమ్ ప్రాంగణంలో మౌలిక సదుపాయల కల్పనకు వాకర్స్ అసోసియేషన్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చిందన్నారు. సుమారు రూ. 5.50 లక్షలు విరాళాలు సమీకరించి లెవలింగ్, కాంక్రీట్ పనులు, టైల్స్, చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసినట్లు వివరించారు. మరో రూ. 4 లక్షలతో క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ దాసు, పాఠశాల పీఈటీ ధనియాల నాగరాజు ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రారంభోత్సవానికి వాకర్స్ సభ్యులను దూరం పెట్టడం దుర్మార్గమన్నారు. జిమ్ నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతల పేర్లతో శిలాఫలకం ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకరించలేదన్నారు. సదరు అధికారులపై ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు కూడా స్పందించి సదరు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వాడీవేడిగా తల్లిదండ్రుల సమావేశం

- ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులపై నిలదీత
- సమర్థంగా చర్యలు ఉంటాయని, ఆందోళన వద్దని పోలీసుల సూచన


సమావేశంలో మాట్లాడుతున్న కంకిపాడు సీఐ మురళీకృష్ణ, పక్కన ఎస్ఐ సందీప్

కంకిపాడు: విద్యాశాఖ నిర్లక్ష్యంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులకు సమర్థించిన టీచర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈడుపుగల్లు మోడల్ స్కూల్ తల్లిదండ్రుల సమావేశం మంగళవారం స్థానిక పాఠశాలలో వాడీవేడిగా జరిగింది. స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసిన మండవ వెంకట శ్రీనివాస్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడటంతో కంకిపాడు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఉపాధ్యాయుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. దీంతో విద్యాశాఖ పర్యవేక్షణలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటుచేశారు. ఎంతో కాలంగా పాఠశాలలో విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, పిల్లలు హెచ్‌ఎం వద్ద ప్రస్తావిస్తే ఇంటి వద్ద చెప్పొద్దని సూచించారని, అందరికీ తెలిసినా చిన్నారుల జీవితాలను నిర్లక్ష్యం చేశారంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వెలిబుచ్చారు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఉపాధ్యాయుడిని, విషయం తెలిసినా దాచిపెట్టిన హెచ్‌ఎంపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికంగా విధుల్లో ఉన్న ఉపాధ్యాయులందరినీ బదిలీ చేసి కొత్తవారిని నియమించాలని డిమాండ్ చేశారు. సీఐ జె.మురళీకృష్ణ మాట్లాడుతూ చిన్నారులు, మహిళలపై జరిగే అసభ్య ప్రవర్తనలు, లైంగిక వేధింపులను సహించేది లేదన్నారు. ఈడుపుగల్లు పాఠశాలలో జరిగిన ఘటనలో నిందితుడిపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గుడ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన పెంపొందిస్తున్నామని తెలిపారు. ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రుల డిమాండ్‌లను ఉన్నతాధికారులకు నివేదిస్తామని, శాఖాపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని వివరించారు. ఎస్ఐ డి.సందీప్, ఎస్ఎంసీ చైర్మన్ ఐ.నవీన, వైస్ చైర్మన్ కోడె శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం సిండికేట్ బ్యాంక్ కాలనీ, కొట్టివారి వీధి, రాజుల బజార్, మల్లెమూడివారి వీధి, చిన్మయి ధ్యాన మందిరం రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నప్రసాద వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు మాదాల బాబురావు కుటుంబ సభ్యుల సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో మంగళవారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలను అరికట్టాలని ర్యాలీ నిర్వహించారు. సచివాలయ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్ జె.నానారావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్యవివాహాల సమాచారం తెలిస్తే వెంటనే నిరోధక అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి హరిత మాట్లాడుతూ బాల్య వివాహాల సమాచారం 1098కి ఫోన్ ద్వారా తెలపాలన్నారు. క్రాప్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్లు పి.దివ్య, జె.స్వరూప, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బల్లలు, కుర్చీలు అందజేత

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు శివారు సీతారామపురం గ్రామంలోని దేవిరెడ్డి నాగిరెడ్డి శ్రీనివాస్ వృద్ధుల ఆశ్రమానికి డైమండ్ కపుల్స్ క్లబ్ వారు రెండు సిమెంట్ బల్లలు, 20 కుర్చీలు, నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ అభాగ్యులకు ఆసరాగా ఉన్న ఆశ్రమం నిర్వాహకుల సేవలు అభినందనీయమన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని వేముల చారిటీస్ చైర్మన్ హజరత్తయ్య గుప్తా, గవర్నర్ గణేష్, మామిడి శ్రీనివాసరావు సౌజన్యంతో ఏర్పాటు చేయడం జరిగిందని క్లబ్ అధ్యక్షుడు కోట సత్యనారాయణ, కార్యదర్శి శ్యాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో భీమరాజు, చైతన్య, కృష్ణకాంత్, మోదాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ కంగనాను సస్పెండ్ చేయాలి

గన్నవరం: రైతులపై చౌకబారు వ్యాఖ్యాలు చేసిన బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఎంపీ కంగనా వ్యాఖ్యాలకు నిరసనగా మంగళవారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీపీఎం, సీపీఐ నేతలు సూరగాని సాంబశివరావు, కట్టెవరపు విజయరావు మాట్లాడుతూ.. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో 700 మంది రైతులు మృతి చెందడంపై ఆ పార్టీ ఎంపీ కంగనా విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. వామపక్ష నేతలు ఎం.ఆంజనేయులు, కళ్లం వెంకటేశ్వరరావు, మిరప నాగేశ్వరరావు, సీహెచ్ భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కంకిపాడు: కృష్ణాష్టమి పర్వదినాన్ని భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. ఈడుపుగల్లు గ్రామంలో సోమవారం రాత్రి కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలు చేశారు. డాము సెంటరులో కృష్ణుడి జెండా దిమ్మ వద్ద పతాకాలను ఎగురవేశారు. జెండా దిమ్మ వద్ద కృష్ణుడి ప్రతిమ ఉంచి భక్తులు విశేషంగా పూజించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.